క్లుప్తంగా

బహిరంగ వేలంలో రూ.16.10లక్షల ఆదాయం



టెంకాయలు విక్రయించుకునేందుకు వేలం నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లెరూరల్: మండల పరిధిలోని యాగంటిలో వెలసిన శ్రీ ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో టెంకాయల విక్రయానికి నిర్వహించిన బహిరంగ వేలం ద్వారా ఆలయానికి రూ.16.10లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి శనివారం తెలిపారు. పాతపాడు గ్రామానికి చెందిన యాగంటి అత్యధికంగా పాటపాడి వేలాన్ని దక్కించుకున్నట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షణాధికారి శశికుమార్, చైర్మన్ తోటబుచ్చిరెడ్డి, ఆలయ సిబ్బంది ప్రసాద్, రమేష్‌బాబు,అర్చకులు సత్యనారాయణశర్మ,లోకనాథ్‌శర్మ తదితరులు ఉన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



వరి పంటలో పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

కోవెలకుంట్ల: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి పంటలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏడీఏ సుధాకర్ సూచించారు. శనివారం మండలంలోని గుళ్లదూర్తి గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వరిలో ఆకు కత్తిరింపు ప్రయోగాలు, నీటి నిల్వ సామర్థ్యం, పొలం పరిసరాల విశ్లేషణ, మిత్ర, శత్రు పురుగులు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. వరి పంట వివిధ దశల్లో వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓ నిరంజన్, పొలంబడి మాస్టర్ ట్రైనర్ కళ్యాణ్‌కుమార్, ఏఈఓ సుబ్బయ్య, వీఏఏ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల కృషి ఫలితంగానే మానవాళి మనుగడ



రోనాల్డ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్లు, సిబ్బంది

డోన్ టౌన్ : వైద్య రంగంలో ఎందరో శాస్త్రవేత్తల కృషి ఫలితంగా మానవాళి ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ పొందడానికి ఉపకరిస్తున్నాయని ప్రభుత్వ ఆసుపత్రి సూపరిడెంట్ డాక్టర్ మహ్మద్ హనీఫ్ అన్నారు. మలేరియాకు కారణమైన దోమను కనుగొన్న శాస్త్రవేత్త సర్ రోనాల్డ్ రాస్ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం సామాజిక కార్యకర్త మహ్మద్ రఫీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్లు భవాని, ఆర్‌కే రెడ్డి, శశికుమార్, జార్జ్, సాహెల్, స్టాఫ్ నర్సులు ఉషాదేవి, గీతాదేవి ఇంద్రజ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల పరిశీలన



జగనన్న కాలనీలో ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగకుమార్

సంజామల: మండల పరిధిలోని ముక్కమల్ల, ఆకుమల్ల గ్రామాలలోని జగనన్న కాలనీలలో జరుగుతున్న గృహ నిర్మాణాలను హౌసింగ్ ఏఈ బాల చంద్రుడుతో కలసి ఎంపీడీఓ నాగ కుమార్ పరిశీలించారు. జగనన్న కాలనీల్లో తిరిగి లబ్దిదారులతో ఎంపీడీఓ మాట్లాడారు. ప్రభుత్వం బిల్లులు సకాలంలో మంజూరు చేస్తుందని, త్వరగా ఇళ్లు నిర్మించుకుని సొంతింటి కల సాకారం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా లబ్దిదారులు ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ ప్రకాష్ రావు, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, ఇంజినీర్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

మహానంది: భర్తమృతితో ఆవేదన చెందుతూ ఒంటరిగా జీవిస్తున్న బండిఆత్మకూరు మండలం పార్నపల్లెకు చెందిన షేక్ మదార్‌బీ(28) ఈనెల 14న ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం మృతి చెందినట్లు ఎస్‌ఐ మల్లికార్జున తెలిపారు. మదార్‌బీ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

సాగు సంబరం!



మిట్టపల్లె గ్రామ వద్ద ట్రాక్టర్‌తో జొన్న విత్తనం వేస్తున్న దృశ్యం

- ఎస్సార్‌బీసీకి నీటి విడుదల... ఆయకట్టు ఆనందం
- ముమ్మరంగా వరి నాట్లు



కొనాపురం వద్ద వరినాట్లు వేస్తున్న దృశ్యం

బనగానపల్లె : ఎస్సార్‌బీసీ ఆయకట్టు రైతులు సంబరంగా సాగు చేపడుతున్నారు. వర్షాభావ పరిస్థితుల మూలంగా ఎస్సార్‌బీసీ కాల్వకు సాగునీరు రాదనుకున్న నేపథ్యంలో రైతులు డీలపడ్డారు. ఇప్పటికే సాగు చేసిన రైతాంగం పరిస్థితి ప్రశ్నార్థకంగా అనుకుంటుండగా అధికారయంత్రాంగం సానుకూలంగా స్పందించింది. అన్నదాతకు భరోసా కల్పిస్తూ ఉన్నామంటూ ఏడురోజుల క్రితం అధికారులు ఎస్సార్‌బీసీ కాల్వ ప్రధాన కాల్వకు నీరు విడుదల చేశారు. గోర్లకల్లు రిజర్వాయర్ నుంచి ఎస్సార్‌బీసీ కాల్వకు సుమారు వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు సమాచారం. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ సాగు పనుల్లో బిజీ అయ్యారు. ప్రత్యేకించి వరి సాగు ముమ్మరంగా చేపడుతున్నారు. ఎస్సార్‌బీసీ పరిధిలో బనగానపల్లె నియోజకవర్గంలోని బనగానపల్లె, అవుకు, కోవెలకుంట్ల, సంజామల, పాణ్యం నియోజకవర్గంలోని పాణ్యం, గడివేముల, నంద్యాల నియోజకవర్గంలోని నంద్యాల మండలాల్లో 1.62లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. గత నాలుగు రోజులుగా జోరుగా వరినాట్లు వేస్తున్నారు. గత నెలలో కురిసిన వర్షం వల్ల ఆయకట్టు పరిధిలో మిరప, మొక్కజొన్న, మినుము తదితర పంటలు సాగు అయ్యింది. ఈ పంటలకు సాగునీరు అవసరం ఉన్న సమయంలో ఎస్సార్‌బీసీ ద్వారా నీటి విడదలతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రైతులు నీటి తడులు పెట్టడంతో నిమగ్నమయ్యారు. ఎక్కువశాతం విస్తీర్ణంలో వరిపంటను రైతులు సాగు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి సంవత్సరం ఆయకట్టుకు సాగునీటి సమస్యలేదు. ఈయేడు కొంత మేర ఆలస్యం జరగడంతో ఇబ్బందిపడిన రైతులు నీటిని విడుదల చేయడంతో ఊపిరి పీల్చుకున్నారు. సాగునీటికి ఇబ్బంది ఉండదని గోరుకల్లు రిజర్వాయర్ ఈఈ సుబకుమార్ సైతం తెలిపారు.

డిసెంబర్ వరకు సాగునీరు సరఫరా

ఎస్సార్‌బీసీ ఆయకట్టుకు డిసెంబర్ వరకు సాగునీరు అందజేస్తామని పాణ్యం, బనగానపల్లె ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కాటసాని రామిరెడ్డి ప్రకటన రైతులకు భరోసా కల్పించింది. సాగునీటికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ప్రణాళికలు రూపొందించాని కాటసాని సోదరులు పేర్కొనడంతో రైతులు ధైర్యంగా సాగు పనుల్లో బిజీబిజీ అయ్యారు. ఎమ్మెల్యేల చొరువతోనే అధికారులు ఎస్సార్‌బీసీకి నీరు విడుదల చేశారని రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



కాపులపల్లి గ్రామం భూముల్లో కళకళలాడుతున్న మిరప పంట

సీఎం పర్యటనను విజయవంతం చేయండి

బేతంచెర్ల: నియోజకవర్గ కేంద్రం డోన్ పట్టణానికి 19న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రానున్న సందర్భంగా ఆయన పర్యటనను విజయవంతం చేయాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ఉర్దూఅకాడమి సభ్యులు మూర్తుజావలి, స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఖాజా హుస్సేన్ అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలోని ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై సీఎం పర్యటనను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, ఇబ్రహీమ్, గూని నాగరాజు, నాగ వెంకటేశ్వర్లు, మురళీ కృష్ణ,తిరుమలేశ్వర్‌రెడ్డి, నజీర్, దస్తగిరి, శేఖర్‌రెడ్డి, శేఖరయ్య, భాస్కర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ చలం రెడ్డి

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష

కొలిమిగుండ్ల: ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం సమీపాన ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మూడో రోజు శనివారం కొనసాగాయి. మాదిగలు అభివృద్ధికి ఎస్సీ వర్గీకరణ ఆయుధం లాంటిదని, ఇప్పటికైనా చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నాగాంజనేయ కోరారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్‌గారి దస్తగిరి, సోరయ్య, కంబయ్య, నారాయణ, కంబగిరి తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

డోన్ రూరల్ : వర్షాభావ పరిస్థితుల మూలంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు కోరారు. పట్టణంలోని నక్కి రామన్న భవనంలో శనివారం సీపీఐ మండల కార్యదర్శి పులిశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టులో తక్కువ వర్షపాతం మూలంగా డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల్లో సాగు చేసిన పంటలు చాలా వరకు ఎండిపోయాని, నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు రాధాకృష్ణ, మోటారాముడు, నారాయణ, బాష తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



విద్యార్థుల ఓజోన్ అక్షరాల ప్రదర్శన

కోవెలకుంట్ల: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓజోన్ పొరవల్ల సమస్త మానవాళి సంరక్షించబడుతోందన్నారు. వాతావర ణ కాలుష్యం వల్ల ఓజోన్‌పొరకు ప్రమాదం పొంచి ఉందన్నారు. అడవులను కాపాడటంతోపాటు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు కృష్ణదాసు, లక్ష్మీదేవి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

డోన్ టౌన్ : పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి సామాజిక బాధ్యత అని హెచ్‌ఎం పద్మావతి అన్నారు. ఓజోన్ పరి రక్షణ దినోత్సవం పురస్కరించుకోని స్థానిక పాతపేట హైస్కూల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి, వెంకటరమణ కాలుష్యం మూలంగా జరిగే ప్రమాదాలను వివరించారు. ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత ఓజోన్ అక్షరాలుగా ప్రదర్శించారు. ఓజోన్ పరిరక్షణ మా బాధ్యత అని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివప్రసాద్, సుబ్బారెడ్డి, మధుసూదనరెడ్డి, సుభాన్, శ్రీనివాసులు, ఆదినారాయణ, లీలావతి, భారతి, లక్ష్మీ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వైద్యశిబిరాల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించండి



మాట్లాడుతున్న శ్రీరామనాథం

నంద్యాల టౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా జిల్లాలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించాలని వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీరామనాథం సూచించారు. జగనన్న సురక్ష పథకంపై శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జిల్లా వైద్యారోగ్య అధికారి డాక్టర్ వెంకటరమణ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. శ్రీరామనాథం మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీ సర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ నెల 30వ తేదీ వరకు ఇంటింటి సర్వేని పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ అక్టోబర్ ఒకటి నుంచి 30వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న 369 విలేజ్ క్లినిక్స్, 16 వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఇందు కోసం 162 రకాల మందులు, 18 సర్జికల్ పరికరాలు, 14 రకాల ఎమర్జెన్సీ కిట్స్ సిద్ధం చేశామన్నారు. డాక్టర్లు జగదీష్ చంద్ర రెడ్డి, కాంతారావు నాయక్ పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య వివరాలు సేకరించాలి

కొలిమిగుండ్ల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వేలో ప్రజల ఆరోగ్య వివరాలన్నీ సేకరించాలని జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం బెలుంలో నిర్వహిస్తున్న సర్వేని తనిఖీ చేసి వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. ఈనెల 30న బెలుంలో మెడికల్ క్యాంప్ ఉంటుందని, నిష్ణాతులైన వైద్య బృందం వస్తుందని ప్రజలకు సమాచారం చేరవేయాలని సూచించారు. సర్వేలో సాధారణ వ్యాధులకు చికిత్సలు చేసి వివరాలను యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ ఆఫీసర్ విశ్వనాథ్,హెల్త్ సూపర్‌వైజర్ చంద్రశేఖర్,వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు

ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

సంజామల: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ నాగకుమార్ సూచించారు. శనివారం ముక్కమల్ల సచివాలయంలో వలంటీర్లు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలుకు కార్యక్రమంపై నిర్వహించిన అవగాన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి ఇంటిని సందర్శించి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకోవాలన్నారు. 30వ తేదీ నుంచి నిర్వహించే మెడికల్ క్యాంప్‌లను ప్రజ లు సద్వానియోగం చేసుకునేలా ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఈశ్వరయ్య, ఏపీఓ ప్రకాష్ రావు,ముక్కమల్ల మాజీ సర్పంచ్ పోచా వెంకట రామిరెడ్డి,వైఎస్ఆర్‌సీపీ నాయకులు శనివారపు వెంకటసుబ్బారెడ్డి,హౌసింగ్ ఏఈ బాలచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

24న షటిల్ టోర్నమెంటు

డోన్ టౌన్ : ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 24వ తేదీన షటిల్ టోర్నమెంటు నిర్వహిస్తున్నట్లు క్రీడాకారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని యూనియన్ క్లబ్ పక్కన ఉన్న బుగ్గన బీపీ శేషారెడ్డి ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ పోటీలను కేవలం ఇండోర్ స్టేడియంలో సభ్యత్వం ఉన్న క్రీడాకారులకు మాత్రమే నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

జిల్లాస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



రెజ్లింగ్ పోటీలో తలపడుతున్న బాలికలు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఉమ్మడి కర్నూలు జిల్లాస్థాయి స్కూల్‌గేమ్ ఫెడరేషన్ పోటీలను ఇన్‌చార్జ్ డీఈఓ మహబూబ్‌బేగ్ ప్రారంభించారు. శనివారం జరిగిన పోటీలో ఆయన మాట్లాడుతూ రెజ్లింగ్ పోటీలో జిల్లాకు మంచిపేరు తీసుకురావాలన్నారు. నంద్యాల జిల్లా స్కూల్‌గేమ్ ఫెడరేషన్ సెక్రటరీ శ్రీనాథ్ ఆధ్వర్యంలో నంద్యాల, కర్నూలు జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు, 40 మంది వ్యాయామ ఉపాధ్యాయులు ఎంపిక పోటీలకు హాజరయ్యారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం షఫక్‌తుల్లా, ఫెడరేషన్ కో ఆర్డినేటర్ శివకుమార్, నంద్యాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు, నాగేంద్ర, ప్రభాకర్, రవికుమార్, విశ్వనాథ్, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఓటర్ల సర్వేకు రాజకీయ పార్టీలు సహకరించాలి



మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కామేశ్వరరావు

బనగానపల్లెరూరల్ : స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కామేశ్వరరావు ఓటర్ల సర్వే పై రాజకీయ పార్టీల ప్రతినిధుతో శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతి చెందిన వ్యక్తుల పేర్లు, గ్రామంలో లేనివారు, డబుల్ ఎంట్రీ పేర్లు ఓటర్ లిస్టులో ఉంటే తొలగించేందుకు ఆధారాలను బీఎల్‌ఓలకు రాజకీయ పార్టీలుసమర్పించాలని సూచించారు. అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుదన్నారు. అలాగే కొత్తగా 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు నమోదు చేయించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించడం జరిగిందని, వీటిలో ఎలాంటి అభ్యంతరాలున్నా రాజకీయ పార్టీలు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో బనగానపల్లె, అవుకు, కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల తహసీల్దార్లు వెంకటేశ్వరు, శ్రీనివాసులు, పుష్పకుమారి, అల్‌ఫ్రెడ్, ఎన్నికల డిప్యూటి తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి, ఆర్‌ఐ రాఘవేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితి ఉత్సవాలకు వేళాయే...

- రేపు చవితి పర్వదినం... ముమ్మరంగా మండపాలు ఏర్పాటు
- ఊపందుకున్న విగ్రహాల కొనుగోళ్లు

డోన్ టౌన్ : వినాయక చవితి ఉత్సవాలు వేళ అయ్యింది. సోమవారం పండగ పర్వదినం నేపథ్యంలో ఉత్సవాల ఏర్పాట్లు ముమ్మరం అయ్యాయి. ఇప్పటికే వినాయకుడి విగ్రహాలు కొలు దీరే మండపాలు ఏర్పాట్లు కొన్నిచోట్ల పూర్తయ్యాయి. ఒక వైపు మండపాల నిర్మాణాలు మరో వైపు విగ్రహాల ఏర్పాటు కోసం చందాలు వసూళ్లలో యువత, పిల్లలు బిజీ బిజీగా తిరుగుతున్నారు. అదేవిధంగా విగ్రహాల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. అయితే ఈయేడు మట్టి వినాయకులను ప్రతిష్టించేందుకు ప్రజలు మొగ్గు చూపుతున్నారు. డోన్ కొత్తబస్టాండ్, ఐటీఐ, వెంకటాంపల్లె రోడ్డు, కంబాలపాడు రోడ్డు, కొండపేట, శేగు థియేటర్, బేతంచెర్ల రోడ్డు తదితర కూడళ్లలో విగ్రహాలు అమ్మేందుకు సిద్ధంగా ఉంచారు. రూ. మూడు వేల నుంచి రూ.30 వేల వరకు ధరల పలికే విగ్రహాలను అమ్మకానికి సిద్ధంగా ఉంచారు తయారీదారులు. విగ్రహాల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. డోన్ పట్టణంలో గతేదాది కంటే ఎక్కువగా విగ్రహాలు ఏర్పాటు చేస్తారని అంచనా. వినాయకు ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేలా అధికారయంత్రాంగం సైతం చర్యలు చేపట్టింది.



అమ్మకానికి ఉంచిని వినాయక విగ్రహాలు



పాతపేట సమీపంలో మండపం ఏర్పాటు చేసిన దృశ్యం

వినాయక మట్టి విగ్రహాల పంపిణీ

బేతంచెర్ల: పట్టణంలోని అమ్మవారిశాల ఆవరణలో వాసవీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సూర్య బళ్లాని, గుప్త ఆధ్వర్యంలో శనివారం 300 మట్టి వినాయకులను ఎస్‌ఐ శివ శంకర్ నాయక్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కందగడ్డల మోహన్ రావు చేతుల మీదుగా ప్రజలకు పంపిణీ చేశారు. రంగు,రంగుల వినాయకుల వల్ల కలిగే భూపర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి మన వంతు బాధ్యతగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించాలని ఎస్‌ఐ శివ శంకర్ నాయక్ సూచించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు కొప్పరపు శేషమోహన్, విష్ణు, మనోహర్, జనార్దన్, లక్ష్మినారాయణ, గణేష్, సతీష్ పాల్గొన్నారు.



బేతంచెర్లలో మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న ఎస్‌ఐ,

మట్టి గణనాథులను పూజించాలి

బనగానపల్లె : పర్యావరణ హితం కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుడికి ప్రతిమలు పూజించాలని వృక్షశాస్త్ర అధ్యాపకురాలు వసుంధర సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో మట్టి వినాయక విగ్రహాలను తయారు చేయించి, పూజల అనంతరం కళాశాల నుంచి పట్టణంలోని పెట్రోల్ బంకు సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రామకృష్ణ, బాబునాథ్,సుధాకర్‌రెడ్డి, కౌసల్యాదేవి,పీడీ విజయకుమారి, వరలక్ష్మీ, వహిదా, ఉమామహేశ్వరరెడ్డి, రవి, నాగతిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



మట్టి వినాయక ప్రతిమలకు పూజలు చేస్తున్న దృశ్యం

వినాయక విగ్రహాల నిమజ్జన ఘాట్ పరిశీలన



కైప చెరువు వద్ద వినాయక విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లును పరిశీలిస్తున్న సీఐ తిమ్మారెడ్డి

బనగానపల్లె : వినాయక విగ్రహాలు నిమజ్జనం నిర్వహించే మండలంలోని కైప చెరువు ప్రాంతాన్ని శనివారం సీఐ తిమ్మారెడ్డి, ఎస్‌ఐలు రామిరెడ్డి, రామాంజనేయరెడ్డి పరిశీలించారు. 22న విగ్రహాల నిమజ్జనం నేపథ్యంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి సీఐ ఆ ప్రాంతంలో కలియతిరిగారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వినాయక విగ్రహాల నిమజ్జనానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సభ్యులకు సూచించారు. అదేవిధంగా విద్యుత్ లైటింగ్ ఏర్పాట్లు చేసుకోవాలని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రతాప్‌రెడ్డికి సూచించారు. ఉత్సవాలు ప్రశాంతంగా సాగేందుకు ప్రతిఒక్కరూ సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు మాధవరెడ్డి, నాగముని, వెంకటసుబ్బయ్య, జగన్నాథ్‌రెడ్డి, మల్లారెడ్డి, సురేష్, విశ్వనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి బుగ్గనకు కృతజ్ఞతలు

డోన్ : రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి డోన్ సమైఖ్య మైనార్టీ క్రైస్తవ సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. డోన్ సమైఖ్య మైనార్టీ క్రైస్తవ సంఘం ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నానాటికి పెరుగుతున్న క్రైస్తవుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని క్రైస్తవ బరియల్ గ్రౌండ్(సమాధుల తోట) కోసం స్థలాన్ని కేటాయించాలని మంత్రి బుగ్గనను కోరామన్నారు. మంత్రి చొరువతో పట్టణ శివారులోని మున్సిపల్ డంప్‌యార్డు ఎదురుగా రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని అధికారులు క్రైస్తవుల సమాధుల తోట కోసం కేటాయించారన్నారు. ప్రహరీ ఏర్పాటుకు సహకరిస్తామని మంత్రి హామీ ఇచ్చారని పాస్టర్ ఫెలోసిప్ నాయకులు తెలిపారు.



మాట్లాడుతున్న పాస్టర్స్ ఫెడరేషన్ సంఘం నాయకులు

విద్యుత్ సమస్యలపై ప్రత్యేక దృష్టి

బనగానపల్లెరూరల్ : బనగానపల్లె విద్యుత్ శాఖ డీఈఈగా శనివారం మద్దిలేటి బాధ్యతలను స్వీకరించారు. గతంలో బేతంచర్ల డీఈఈ మధుసూదన్ రెడ్డి ఇక్కడ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఇటీవల జరిగిన పదోన్నతుల్లో భాగంగా నంద్యాల సీటీ మీటర్స్ సెక్షన్‌లో ఏఈగా విధులు నిర్వహిస్తున్న మద్దిలేటిని డీఈఈగా పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. డీఈఈగా విధుల్లో చేరిన మద్దిలేటికి రూరల్ ఏఈ శ్రీనివాసులు, టౌన్ ఏఈ గర్జప్పతో పాటు కాంట్రాక్టర్ కంబగిరి, సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. రైతులకు ఎలాంటి సమస్యలున్నా ఫోన్‌లో లేదా స్వయంగా ఫిర్యాదు చేసిన వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.



డీఈఈగా బాధ్యతలు స్వీకరిస్తున్న మద్దిలేటి

చురుగ్గా గ్రూపు దేవాలయాల నిర్మాణ పనులు



వినాయక, వేణుగోపాల స్వామి ఆలయాలు నిర్మిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: పట్టణంలోని గొరిపేట ఆంజనేయ, చెన్నకేశవ స్వామి ఆలయ ఆవరణలో పునర్నిర్మిస్తున్న వినాయక, వేణుగోపాల, మాధవ స్వామి ఆలయాల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. ఆలయాల పునర్నిర్మాణానికి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో 1.50 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు చేపట్టిన పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. వినాయక, వేణుగోపాల, మాధవ స్వామి ఆలయ నిర్మాణ పనులతోపాటు ఉత్తర ద్వారం, కాలక్షేప మండప నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. పనులు పూర్తయితే పూరాతన ఆంజనేయ, చెన్నకేశవ స్వామి ఆలయానికి మహర్దశ రానుందని పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కామేశ్వరీదేవికి పట్టువస్త్రాలు

మహానంది: మహానందిలో అక్టోబర్ 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్న దసరా నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి దాతలు శనివారం పట్టువస్త్రాలు అందించారు. హైదరాబాద్‌కు చెందిన వారణాసి రామ్మోహన్‌రావు, విజయలక్ష్మి దంపతులు అమ్మవారికి ఉత్సవాలకు అవసరమైన పది పట్టుచీరలు, ఇతర వస్తువులను అందజేశారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, వేదపండితులు రవిశంకర అవధాని మాట్లాడుతూ దాతలు వారణాసి రామ్మోహన్‌రావు దంపతులు ఇరవై ఏళ్లుగా పట్టువస్త్రాలు అందిస్తున్నారని చెప్పారు. అనంతరం స్థానిక అలంకార మండపంలో దాతలకు శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి పండితులు పాల్గొన్నారు.



ఈఓ చంద్రశేఖర్‌రెడ్డికి పట్టువస్త్రాలు అందిస్తున్న రామ్మోహన్‌రావు దంపతులు